# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 27-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తమిళనాడులో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఈరోజు కోయంబత్తూరు చేరుకున్నారు.
- ❖ ఆల్ - ఇండియా డిజిటల్ క్విజ్ పోటీలో పాల్గొనాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యువతకు పిలుపునిచ్చారు.
- ❖ భారత్‌ను బాల్య వివాహాలు లేని దేశంగా మార్చడమే లక్ష్యమని కేంద్ర మంత్రి అన్నపూర్ణా దేవి పేర్కొన్నారు.
- ❖ సామాజిక మాధ్యమాలను నియంత్రించేలా ప్రస్తుత చట్టాలను బలోపేతం చేయాల్సి ఉందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ అభిప్రాయపడ్డారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

"వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్"లో భాగమయ్యేందుకు ఆల్ - ఇండియా డిజిటల్ క్విజ్ పోటీలో పాల్గొనాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యువతకు పిలుపునిచ్చారు. యువత, వారి వినూత్న ఆలోచనలను ప్రభుత్వ అత్యున్నత స్థాయి అధికారులకు వినిపించేందుకు ఇది ప్రత్యేకమైన అవకాశమని సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. "వికసిత్ భారత్ ఛాలెంజ్" అనే నాలుగు - దశల పోటీలో యువత పాల్గొనడంతో పాటు ఆలోచనలను తెలియజేసే అవకాశం ఉంటుంది. 15 నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సు వారంతా ఈ పోటీలో పాల్గొనవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ ఉభయ సభలు ఈరోజు ప్రారంభం కాగానే విపక్షాల ఆందోళన కారణంగా వాయిదా పడ్డాయి. ఉదయం రాజ్యసభ ప్రారంభం కాగానే, ఉత్తరప్రదేశ్, మణిపూర్ లలో హింస, అదానీపై ఆరోపణలపై ప్రతిపక్షాలు 267వ నిబంధన ప్రకారం వాయిదా నోటీసులను ఇవ్వగా చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖర్ తిరస్కరించారు. రాజ్యసభ తిరిగి 11 గంటల 30 నిమిషాలకు ప్రారంభం కాగానే విపక్షాలు అదానీపై ఆరోపణల అంశాన్ని లేవనెత్తడంతో మళ్ళీ సభలో వాగ్వాదం జరిగింది. ఇక దిగువ సభ మధ్యాహ్నం 12 గంటలకు మొదటి వాయిదా తర్వాత సమావేశమైనప్పుడు, కాంగ్రెస్,

సమాజ్ వాదీ పార్టీ, డిఎంకె, టిఎంసి సహా ఇతర ప్రతిపక్ష సభ్యులు అదానీ వ్యవహారాన్ని లేవనెత్తి నినాదాలు చేస్తూ.. వెల్ లోకి దూసుకెళ్లారు. సభను నిర్వహించడానికి సహకరించాలని స్పీకర్ ఓం బిర్లా పదేపదే విజ్ఞప్తి చేశారు. ప్రశ్నోత్తరాల సమయం తర్వాత అన్ని అంశాలపై చర్చిస్తామని హామీ ఇచ్చారు. అయినా విపక్షాలు నిరసనను కొనసాగించడంతో సభను రేపటికి వాయిదా వేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం మాత్రమే కాదని, మానవ హక్కుల ఉల్లంఘన అని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి అన్నారు. “బాల్ వివాహ్ ముక్త్ భారత్” పేరిట ఒక జాతీయ ప్రచార కార్యక్రమాన్ని ఆమె ఈరోజు ఢిల్లీలో ప్రారంభించారు. భారత్‌ను బాల్య వివాహాలు లేని దేశంగా మార్చడమే ప్రాథమిక ఎజెండాగా ఈ ప్రచార కార్యక్రమాన్ని రూపొందించారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 130 జిల్లాలను గుర్తించిందని, కేంద్రీకృతంగా ఈ ప్రచారాన్ని అమలు చేస్తామని పేర్కొంటూ....

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సామాజిక మాధ్యమాలను, ఓవర్ - ది - టాప్ (OTT) ప్లాట్‌ఫారాలను నియంత్రించేలా ప్రస్తుత చట్టాలను బలోపేతం చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కేంద్ర సమాచార, ప్రసార, రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. ఈరోజు లోక్ సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ... ప్రస్తుత పరిస్థితుల్లో సోషల్ మీడియాకు జవాబుదారీతనాన్ని తీసుకురావలసి ఉందన్నారు. ప్రసారమైన లేదా ప్రచురించబడిన అంశంపై తనిఖీలు గతంలో ఉండేవని, తద్వారా జవాబుదారీతనం ఉండేదని, కాలక్రమేణ ప్రచురించబడిన అంశంపై తనిఖీలు తగ్గుముఖం పట్టాయన్నారు. దీనివల్ల సమాజిక మాధ్యమాలపై నియంత్రణ లోపించిందని అన్నారు. అదేవిధంగా అసత్య వార్తల కారణంగా మీడియా మీద నమ్మకం సన్నగిల్లుతుందని, ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతుందని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తమిళనాడులో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఈరోజు కోయంబత్తూరు చేరుకున్నారు. ఊటీలోని వెల్లింగ్టన్ డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్‌లో రేపు జరగనున్న కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొంటారు. అలాగే... ఈ నెల 29వ తేదీన రాష్ట్రపతి నీలగిరిలో గిరిజనులతో సమావేశమయ్యి, వారితో సంభాషించనున్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో కోయంబత్తూరు, ఊటీ పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆమె ఊటీకి రోడ్డు మార్గంలో ప్రయాణించనున్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

55వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవం ముగింపు దశకు చేరుకుంది. ఈ నెల 20వ తేదీన ప్రారంభమైన ఈ ఉత్సవంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ రంగ ప్రముఖులు, ఔత్సాహికులు పాల్గొన్నారు. స్టార్ దర్శకుడు రాబీ విలియమ్స్ జీవిత విశేషాలతో మైఖేల్ గ్రేసీ రూపొందించిన బెటర్ మేన్ ఆస్ట్రేలియా చిత్రంతో ప్రారంభమైన ఈ ఉత్సవం భారతీయ సినిమాకి చెందిన నలుగురు దిగ్గజ ప్రముఖులు రాజ్ కపూర్, మహమ్మద్ రఫీ, తపన్ సిన్హా, అక్కినేని నాగేశ్వర రావుల శత జయంతి వేడుకలకు వేదిక అయ్యింది. చలనచిత్రోత్సవం ప్రారంభం నుండి, సినిమా ప్రదర్శనలకు, వివిధ ఈ వెంట్లకు భారీ సంఖ్యలో ప్రేక్షకులు తరలివచ్చారు. సినిమా ప్రదర్శనలకు నేడు చివరి రోజు. కాగా... రేపటి ముగింపు రోజున రెండు సినిమాలు మాత్రమే ప్రదర్శింపబడనున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి బంగాళాఖతంలో ఉన్న తీవ్ర వాయుగుండం రాగల 12 గంటల్లో ఉత్తర వాయువ్య దిశలో పయనించి తుపానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా ప్రాంతంలో పలు చోట్ల రేపు, ఎల్లుండు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీర ప్రాంతాల్లో 35 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాద దాడులను ఎదుర్కోవడానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జమ్ములో శాశ్వత నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (NSG) హబ్‌ను ఏర్పాటు చేసింది. ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు వెనువెంటనే చర్యలు తీసుకొని దాడులను తిప్పికొట్టడానికి NSG ఇప్పుడు జమ్ములో శాశ్వతంగా ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. జమ్ము ప్రాంతంలోని భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకొని ఉగ్రదాడులు జరగవచ్చన్న నివేదికల నేపథ్యంలో NSG హబ్‌ను ఏర్పాటు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో దాదాపు 59 వేల వక్ఫ్ ఆస్తులు ఆక్రమణకు గురవుతున్నాయని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఈరోజు లోక్‌సభకు తెలిపారు. వక్ఫ్ చట్టంలోని సెక్షన్ల ప్రకారం, అనధికార ఆక్రమణలు, వక్ఫ్ ఆస్తుల ఆక్రమణలపై చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు ఉందని లోక్‌సభలో లిఖితపూర్వకంగా తెలిపారు. వక్ఫ్ ఆస్తుల అమ్మకం, బహుమతి, మార్పిడి, తనఖా లేదా బదిలీ చెల్లుబాటు కాదని చట్టం చెబుతోందన్నారు. ఈ ఆస్తులకు సంబంధించిన ఫిర్యాదులపై అవసరమైన చర్యల కోసం రాష్ట్ర వక్ఫ్ బోర్డులు, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపుతున్నట్లు కేంద్రమంత్రి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, యునైటెడ్ కింగ్‌డమ్ దేశాలు కృత్రిమ మేధ, టెలీ మెడిసిన్, క్లైమేట్ మోడలింగ్ రంగాల్లో మరింత సహకరించుకునేందుకు అవకాశాలు ఉన్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పియూష్ గోయల్ అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన యుకే- ఇండియా బిజినెస్ కౌన్సిల్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... దీని ద్వారా ఇరు దేశాల్లోని లక్షలాది మంది ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనలు జరిగిన నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాలని కేంద్ర జౌళి పరిశ్రమల శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ కోరారు. పార్లమెంట్ వెలుపల ఈరోజు ఆయన విలేఖరులతో మాట్లాడుతూ... బంగ్లాదేశ్ లో జరుగుతున్న దాడులు మానవత్వానికి విరుద్ధమన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పార్లమెంట్ వద్ద మాట్లాడుతూ... బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింస చాలా బాధాకరమని అన్నారు. పాలస్తీనాలో ఏదైనా అవాంఛనీయ ఘనట జరిగితే స్పందించే వారంతా బంగ్లాదేశ్ ఘటనలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్ము కాశ్మీర్‌లో సమాచార హక్కు పోర్టల్‌ను ప్రారంభించినట్టు ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఆర్టీఐ పోర్టల్ ద్వారా పౌరులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో అందజేయవచ్చు. ప్రభుత్వ కార్యాలయాలకు వ్యక్తిగతంగా వెళ్ళవలసిన అవసరం లేకుండా దరఖాస్తు చేసుకోవడం, దరఖాస్తుల ప్రస్తుత స్థితిని తెలుసుకోవడం వంటివి ఈ పోర్టల్ ద్వారా చేయవచ్చు. ఆర్టీఐ లావాదేవీల్లో పారదర్శకతను, జవాబుదారీ తనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ పోర్టల్ ను ప్రారంభించినట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ పోర్టల్ సేవలు వచ్చే నెల 10వ తేదీ నుండి పూర్తి స్థాయిల

అమలులోకి వస్తాయి. ఆర్టీఐ లావాదేవీలు సజావుగా అమలు జరిగేలా చూసేందుకు, డిపార్ట్‌మెంట్, జిల్లా, డైరెక్టరేట్ స్థాయిల్లో నోడల్ అధికారులను నియమించారు.

==================================

ఎన్నికల్లో ఓటమి పాలైనప్పుడు మాత్రమే కాంగ్రెస్ పార్టీ ఈవీఎం ల పనితీరుపై ఆరోపణలు చేస్తుందని భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా అన్నారు. ఈవీఎంల వల్ల ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలు, పేదల ఓట్లు గల్లంతవుతున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. దీనిపై ఆయన ప్రతికా ముఖంగా స్పందిస్తూ... దాదాపు ప్రతి రాష్ట్రంలో కాంగ్రెస్‌ను పక్కన పెట్టారన్నారు.

==================================

==================================